క్లుప్తంగా

చర్యలకు డిమాండ్



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

పార్వతీపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను పరిమితికి మించి వాహనాలపై ఎక్కించి నడుపుతున్నారని తక్షణమే పోలీసు శాఖ తరఫున తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకుడు బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఏఎస్పీ అంకిత సురానకు ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు బస్సుల వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట చరణ్, వికాష్, సుమన్ తదితరులు ఉన్నారు.

ఎందుకొచ్చిన.. హంగామా..!

పార్వతీపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ సంయుక్త సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్టు దాని కోసం హంగామా చేయడం ఎంత వరకు సమంజసమని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ అన్నారు. 17 కమిటీలు ఏర్పాటు చేయడం, విట్‌నెస్ కోసం ఒక అధికారిని ప్రధానోపాధ్యాయులే నియమించుకోవడం, వారు ఫొటోలు, వీడియోలు తీసి అప్‌లోడ్ చేయడం వంటి పనులు చేయడం అంటే పాఠశాలలో పని చేస్తున్న ఇతర ఉపాధ్యాయులను అవమానించడమే కదా అని సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ సమావేశం వల్ల 10వ తేదీ వరకు కొంత మేరకు బోధనకు ఆటంకం కలగదా? అని ప్రశ్నించారు. ఈ మేరకు విట్‌నెస్ అధికారి నియామకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ సభలు

పార్వతీపురం: బలిజిపేట మండలం పెదపెంకి గ్రామంలో ఈ నెల 7న ఎంఆర్‌పీఎస్ 31 ఆవిర్భావ సభలను నిర్వహించనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గొడబ ప్రభాకరరావు తెలిపారు. శనివారం పార్వతీపురంలో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాల మేరకు ఆవిర్భావ సభలను గ్రామాలలోను, మండల కేంద్రాలలోను, జిల్లా కేంద్రంలో నిర్వహించాలని ఎంఎస్ఎఫ్ కమిటీలకు సూచించడం జరిగిందన్నారు. ఆయనతో పాటు బోసు మన్మధరావు తదితరులున్నారు.

208 కేసుల పరిష్కారం



కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్

సాలూరు: పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 208 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్ తెలిపారు. క్రిమినల్, మనోవర్తి, గృహహింస తదితర కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌ఏ ధ్రువీకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నేఫా

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి, ఆర్‌ఏ(రైన్ ఫారెస్ట్ అలయన్స్) ధ్రువీకరణపై రైతుల కు అవగాహన కల్పించారు. రెండు రోజులుగా జరు గుతున్న ఈ కార్యక్రమానికి రైన్ ఫారెస్ట్ అలయన్స్ అసోసియేషన్ ట్రైనింగ్ నెట్‌వర్క్ రిసోర్స్‌పర్సన్ ఎస్.నేఫా హాజరై, ఆర్‌ఏ ధ్రువీకరణ పొందేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పండించే పంటలకు ఆర్‌ఏ ధ్రువీకరణ రావాలంటే ఏడు ప్రామాణికాలు పాటించాలని తెలిపారు. ఆర్‌ఏ ధ్రువీకరణ ఉంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 150 దేశాల్లో వ్యవసాయో త్పత్తులను విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు ఈడీ సరోజ్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



సూచనలిస్తున్న ఎంఈవో సింహాచలం

గరుగుబిల్లి: బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో1 సామల సింహాచలం సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో వెల్‌ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి అర్హులను గుర్తించి, కార్యాలయానికి జాబితా అందజేయాలన్నారు. ఈ నెల 10న జరిగే పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో2 కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణతో మంచి ఆదాయం

- మేత విషయంలో జాగ్రత్తలు పాటించాలి
- పశు వైద్యాధికారుల సూచనలు



గడ్డి మేస్తున్న గేదెలు

బలిజిపేట: రైతులకు వ్యవసాయం ప్రధాన వృత్తి అయినప్పటికీ దానికి అనుసంధానంగా పశుపోషణ కూడా అవసరం. వీటి వలన రైతులకు అదనపు ఆదాయం పొందటానికి వీలుంటుంది. వ్యవసాయం ద్వారా సీజన్ల వారీగా ఆదాయం సమకూరితే, పశు పోషణతో ప్రతి నెలా ఆదాయం వచ్చే వీలుంటుంది. అయితే పశువుల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే అవి సక్రమంగా పాలు ఇస్తాయి. అనారోగ్యం బారిన పడకుండా ఉంటాయి. ప్రస్తుతం వానాకాలం కావడంతో పశువులను అనేక రోగాలు ఆశించే ప్రమాదం ఉంది. పశు సంపద అభివృద్ధి చెందాలంటే వాటికి పోషకాలతో కూడిన ఆహారం అందించడం చాలా అవసరం. తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు, నీరు అవసరమవుతాయి.

మాంసకృత్తులు

పశువుల శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధక శక్తికి మాంసకృత్తులు తోడ్పడతాయి. శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పెయ్యిల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్క చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసం పొడి వంటి ముడి పదార్థాలు పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

నీరు లేకుండా..

మేత లేకుండా పశువులు మూడు నెలల పాటు బతకగలిగినా, నీరు లేకుండా ఐదు రోజులకు మించి ఉండలేవు. శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు నీరు ఎంతోగానో ఉపయోగపడుతుంది. ఆహారం లోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగు గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు దోహదపడుతుంది. పశువులకు నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువుల డీహైడ్రేషన్ గురై మరణిస్తాయి. కాబట్టి నీరు కూడా పశుపులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50 – 60లీటర్ల నీరు అవసరం.

వర్షాకాలంలో తస్మాత్.

వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రైతులు అప్రమత్తత పాటించాలి. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి అవసరమైన వైద్య సేవలు పొందాలి. ప్రస్తుతం వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నాం.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

పిండిపదార్థాలు

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు, అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి పిండి పదార్థాలు కాపాడుతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంతో పాటు ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమం పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైనది. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని ప్రసాదిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు వంటి వాటిలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

● ఆర్టీసీలో ఉద్యోగుల నిరసన



తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు నిరసన కొనసాగించారు. యూనియన్ సాలూరు డిపో కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు టీఆర్ బాబు, కాంతారావు, రాయుడు తదితరులు పాల్గొన్నారు. – సాలూరు

జగన్నాథ ఉత్సవాల ముగింపు



బలిజిపేట : గుండిచా గుడి వద్ద స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



పార్వతీపురం టౌన్: పట్టణంలో జగన్నాథస్వామి రథయాత్ర



మక్కువ : జగన్నాథ స్వామి ఊరేగింపు

బలిజిపేట: జగన్నాథ స్వామి ఉత్సవాలు శనివారం ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుండిచా గుడి వద్ద తొమ్మిదో రోజు స్వామి వారిని అలంకరించారు. ఆలయ ధర్మకర్త బి.శ్రీధర్, ప్రధాన అర్చకులు హరి ఆధ్వర్యంలో నవరాత్రులు ఘనంగా ముగించారు. గుడి ప్రాంగణంలో యాత్రను నిర్వహించారు. ముగింపు రోజు ఉదయం నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది.

పార్వతీపురంలో

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో జగన్నాథ స్వామి మారు రథయాత్రను ఘనంగా శనివారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. జగన్నాథస్వామి, సుభద్రాదేవి, బలరాం స్వాముల ప్రతిమలను రథంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని గుడించె మండపం నుంచి జగన్నాథ స్వామి ఆలయానికి యాత్రగా తీసుకు వెళ్లారు.

మక్కువలో..

మక్కువ: మండల కేంద్రంలో జగన్నాథస్వామి మారు రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. జగన్నాథస్వామి విగ్రహాలను దేవాంగుల వీధి నుంచి మెయిన్ రోడ్ జంక్షన్ వరకు తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. ఎస్.పెద్దవలస గ్రామంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు.

సీఆర్‌టీలుగా ఆదివాసీలనే నియమించాలి



ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పరిధి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో అర్హులైన షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించాలని, వారినే రెన్యూవల్ చేయాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీ వాస్తవను ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో పీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో నివసిస్తున్న గిరిజనుల కొరకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఉందన్నారు. ఇందులో నమోదు చేసుకున్న గిరిజనులకే ఉద్యోగ, ఉపాధి తప్పనిసరిగా కల్పించాలన్నారు. గతంలో కాల్ లెటర్ పంపి ఉద్యోగ ఉపాధి కల్పించే వారన్నారు. ఇప్పుడు అలా జరగడం లేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. పీవోను కలిసి విన్నవించిన వారిలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పల అమర్‌నాథ్, మన్యం జిల్లా ఉపాధ్యక్షుడు వాటక చక్రపాణి, జీఎల్ పురం ప్రధాన కార్యదర్శి కిల్లక రవికుమార్, నేతలు ఆరిక వెంకటరావు, మూటక వెంకట రావు, జీఎస్‌యూ నాయకులు పళ్ల సురేష్, గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకులు రామకృష్ణ ఉన్నారు.

పురుగులు పట్టిన బియ్యం పరిశీలన



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం బియ్యంలో పురుగులున్నట్టు సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు పాఠశాలలో బియ్యాన్ని శనివారం పరిశీలించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, సీఎస్‌డీటీ రమేష్‌నాయుడు, వీఆర్వో కుమారస్వామి బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తహసీల్దార్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో శనివారం సాక్షి దినపత్రికలో 'మెనూ పురుగులతోనే తిను'శీర్షిక వెలువడిన కారణంగా స్పందించి బియ్యం నిల్వలను పరిశీలించామన్నారు. పాఠశాల గదిలో నిల్వ ఉన్న పాత బియ్యంలో పురుగులున్నాయని, తేమ కారణంగా కొత్తగా వచ్చిన సన్న బియ్యం బస్తాలపై పురుగులు చేరాయన్నారు. దీంతో పాత బియ్యం బస్తాలను వేరొక చోటకు తరలించాలని ఉపాధ్యాయులకు సూచనలివ్వడం జరిగిందన్నారు. దీంతో పురుగులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలి : పీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: నియోజకవర్గంలో గుర్తించిన బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. శనివారం గిరిమిత్ర సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్, బంగారు కుటుంబం – మార్గదర్శిపై సమావేశాన్ని నిర్వహించారు. బంగారు కుటుంబాలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని గుర్తించిన కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేసుకొని సహాయ కార్యక్రమాలను అందించడం ద్వారా పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ అవసరాలను తెలుసుకోవడానికి మార్గదర్శితో సమన్వయం చేసుకొని కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ప్రతీ కుటుంబం సమాజంలో గౌరవంగా బతికేందుకు, ఆర్థికంగా బలపడేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



ఎంఈవోకు సమ్మె నోటీసు అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

బలిజిపేట: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నందున ఆ రోజు మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించలేమని నిర్వాహకులు ఎంఈవో సామల సింహాచలంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో భోజన పథకం నిర్వాహకులు, ఆయాలు పాల్గొంటారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. భోజన పథకంలో చేస్తున్న మార్పులకు అనుగుణంగా నిర్వాహకులకు పారితోషికాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. నిర్వాహకులు, స్వీపర్లు పాల్గొన్నారు.

'భోజన' నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేత

మక్కువ: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై.నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో శ్యాంసుందర్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వై. నాయుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహణ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి 20 రూపాయలు చొప్పున ఇవ్వాలన్నారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, భోజన నిర్వహణ కార్మికులను రాజకీయ కక్షతో తొలగింపు ఆపాలన్నారు. మండల పరిధిలో కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగంలో ఉన్నటువంటి కార్మికులు ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు జి.కృష్ణారావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ నాయకురాలు పార్వతి, రవణమ్మ తదితరులు పాల్గున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండలంలోని షేకుపాడు, రంగుపురం, దండుసూర గూడ గ్రామాలను శనివారం సందర్శించిన ఆయన.. సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని, వారి మెసేజ్‌లకు రిప్లై ఇవ్వవద్దని, ఓటీపీ చెప్పవద్దని తెలిపారు. అలాగే గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలను తీసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పార్వతీపురం టౌన్: అదానీ, సెకీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు డిమాండ్ చేశారు. పార్వతీపురం విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ మన్యం జిల్లా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలనీ, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని అదాని, సెకీ సంస్థలతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో విద్యుత్ చార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్లను భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను చెల్లించుకోలేక గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే పదేపదే విద్యుత్ చార్జీలు పెంచడం శోచనీయమని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఈవీ నాయుడు, కూరంగి గోపీనాయుడు, జిల్లా సమితి బీటి నాయుడు, సాలాపు అనంతరావు, సింహాద్రి దుర్గారావు, సింహాద్రి కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై టీచర్ల ఆగ్రహం

పార్వతీపురం రూరల్:

పాఠశాలల్లో ఈ నెల 10న జరగనున్న మెగా తల్లిదండ్రుల – ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణ తీరును పరిశీలించేందుకు సాక్షులుగా ఇతర శాఖల ఉద్యోగులను నియమించడం విద్యాశాఖాధికారుల, ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని ఏపీటీఎఫ్ మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. తక్షణమే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది కూడా ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల, ప్రజల సహకారంతో విజయవంతం చేశామని, ఈ ఏడాది కూడా విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖల ఉద్యోగులను నియమించడం తమను కించపరిచేలా ఉందని పేర్కొన్నారు. ఇతర శాఖల ఉద్యోగుల పర్యవేక్షణకు ఏర్పాటు అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ఉపాధ్యాయుల వృత్తికి భంగం కలిగించే ఇటువంటి చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.